# 10

# జీవితపు సరియైన అంచును పైకి త్రిప్పుట

## (ప్రసంగి 7; 8)

జీవితపు ప్రాధాన్యతల విషయంలో జనులు ఎంతగా కలత చెందియున్నారో ఉదహరించడానికి ప్రసంగి 7, 8 అధ్యాయాలు అనేకమైన తారతమ్యాలను సూచించాయి. అతి శ్రేష్ఠమైనవని మనం తలచేవన్నీ ఎల్లవేళలా అలాటివి కావు. మనం జీవితాన్ని పైనుండి క్రిందికి చూస్తున్నాం; అదే సమయంలో సరియైన అంచే పైకి ఉన్నట్టు తలంచుతూ ఉంటాం. దేవుడు లేకుండ మానవ జీవితం పైనుండవలసింది క్రిందికి తిప్పబడింది; అయితే మనం దాన్ని అలా గ్రహించటం లేదు. పౌలును అతని జతపనివారును థెస్సలొనీకకు వెళ్లినప్పుడు, "భూలోకమును తలక్రిందు చేసిన" వీరిని కొందరు అక్కడ నిందించారు (అపో. 17:6). వాస్తవంగా, అప్పటికే భూలోకము తలక్రిందులుగా ఉంది. క్రైస్తవులు దానిని సరియైన తీరులో పెట్టడానికి ప్రయత్నించారు.

జీవితంలో ఏది శ్రేష్ఠమైనదో దాన్ని సొలొమోను వర్ణించినప్పుడు, సగటు మానవుడు దానిని శ్రేష్ఠమైనదిగా ఎంచకపోవచ్చు. శ్రేష్ఠమైనవిగా సొలొమోను ఆలోచించిన కొన్ని జీవిత అనుభవాలను మనం తప్పించుకోవచ్చు ఎందుకంటె అవి అంత సంతోషకరమైనవి కావు.

### పరిస్థితులను ఉన్న రూపంలోనే చూడు (7:1-7)

మొదట, సుగంధ తైలము కంటె మంచిపేరు మేలు అని సొలొమోను అన్నాడు. బైబిలు కాలంలో విలువైన సుగంధ తైలాన్ని భద్రంగా దాచుకునే వారు. యేసు పాదములకు పూయడానికి విలువైన అత్తరును మరియ ఉపయోగించినప్పుడు ఇస్కరియోతు యూదా మండిపడ్డాడు. అది మూడు వందల దేనారములకు అమ్మి పేదలకు యియ్యలేదని అతడు వాపోయాడు. పేదల మీద దయగలిగి అతడు ఈ మాటలు చెప్పలేదు. అతనికి సొమ్మున్న సంచీని ఇచ్చారు. అందులోనుండి కొంత కొట్టివేయాలన్న తలంపుతో అతడు అలా చెప్పినట్టున్నాడు (యోహాను 12:1-6). సామెతలు 22:1 యిలా అంది: "గొప్ప ఐశ్వర్యముకంటె మంచిపేరును వెండి బంగారముల కంటె దయయు కోరదగినవి." "యూదా" పేరు ఎల్లప్పుడు హేళనగా ఉపయోగింపబడుతుంది ఎందుకంటే, తన మనస్సులో అతడు జీవితాన్ని తలక్రిందులు చేశాడు. అతనికి సరియైన ప్రాధాన్యతలు లేవు.

రెండవది, జనన దినముకంటె మరణ దినము మేలు అని సొలొమోను అన్నాడు. ఈ సంఘటనలను గూర్చి తప్పక మనకు విభిన్నమైన భావనలుంటాయి. ఒక బిడ్డ

పుట్టినప్పుడు మనం ఆనందిస్తాం, మన ప్రియతములలో ఒకరు చనిపోయినప్పుడు ఏడుస్తాం. మనం జన్మ దినాలను జరుపుకుంటాం, "మరణానికి శోకిస్తాం." సొలొమోను ప్రకారమైతే, బిడ్డ పుట్టినప్పుడు ఏడ్వాలి, మరణ సమయమున ఆనందించాలి.

మూడవది, ఒక విందుకు వెళ్లడం కంటె సంతాపానికి వెళ్లడం మంచిది, విందుకెళ్తే కాసేపట్లో అరిగిపోయే కడుపునిండా భోజనం మాత్రమే దొరుకుతుంది. తాత్కాలికమైన సంతోషం కలుగుతుంది. మరోవైపు శోకమైతే మనసును పరిపక్వం చేసే హృదయ భావాలను కలిగిస్తుంది.

నాల్గవది, బుద్ధిహీనుని పాటను వినడంకంటె జ్ఞాని గద్దింపును ఆలకించుట శ్రేష్ఠము. తమను తాము సరిదిద్దుకోలేని యువకులు గొప్ప చప్పుళ్లతో కూడిన సంగీతం విని ఆహ్లాదంలో మునిగిపోతారు. సోమరితనముతో కూడిన వినోదము పనికిమాలినది, ఇక సమసిపోయే నవ్వు కుండకింద పెట్టిన ముళ్ల పొయ్యిలాంటిది.

మన ప్రాధాన్యతలను మనం గుర్తించేవరకు "అంతకంటే మంచివి" అనే జాబితా మన ముందు నిలుస్తుంది (దీనికంటె ఏది శ్రేష్ఠమైనది అనే జాబితాను చూచాం).

## కడపటి ఫలితాలను ఆలోచించు (7:8-14)

క్రీడాకారునికి తర్ఫీదు పొందడం ముఖ్యం. అతనికి చెమట పట్టదు శ్రమ అనిపించదు, నరాలకు నొప్పిపుట్టదు. ఎందుకంటే అతనికి ఈ నొప్పి శ్రమ ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. అతని దృష్టి అంతా ఆఖరి పందెంవైపు, చివరి గీతవైపు ఉంటుంది. ఇప్పుడు జరిగేదేది మనకు అర్థాన్నివ్వదు. అది అంతిమ పరిణామం ఎలా ఇస్తుందో అదే ముఖ్యం. "కార్యారంభము కంటె కార్యాంతము మేలు ..." (7:8ఎ).

గర్వంగా ఉండడం కంటె ఓర్పు కలిగియుండడం మేలని 7:8బి–10లో మనం చదువుతాం:

> అహంకారము గలవానికంటె శాంతముగలవాడు శ్రేష్ఠుడు. ఆత్రపడి కోపపడవద్దు; బుద్ధిహీనుల అంతరింద్రియములందు కోపము సుఖనివాసము చేయును. ఈ దినములకంటె మునుపటి దినములు ఏల క్షేమకరములు అని యడుగవద్దు; ఈ ప్రశ్న వేయుట జ్ఞానయుక్తము కాదు.

శాంతములేని వానికి కోపం త్వరగా వస్తుంది. త్వరగా కోపపడడం పనికిమాలినతనం మాత్రమే కాదు శాంతం లేకపోవడం మన జీవితాలను దూరపరచుకొనేలా చేస్తుంది. ఇది కూడా బద్ధిహీనతయే. మనం చిన్నవారైయున్నప్పుడు, త్వరగా పెద్దవారమై జీవితాన్ని స్వయంగా గడుపగోరతాం. మనం పెద్దవారమైన తరువాత, చిన్నవారంగా ఉంటేనే బాగుండునని తలంచుతాము. ఆలాటి కోర్కె సుడిగాలిని తరుమ ప్రయత్నించినట్టు ఉంటుంది. జీవితంలో మన భాగమేదో దాన్ని ఓర్పుతో లేక సహనంతో అంగీకరించాలని సొలొమోను నిజంగా చెప్పుతున్నాడు.

జ్ఞానము స్వాస్థ్యమంత ఉపయోగమని సొలొమోను అంటున్నాడు (7:11–14). ధనము, జ్ఞానము అనేవాటికి వాటివాటి ప్రయోజనాలుంటాయి. అయితే సొత్తు కలిగియుండవలసిన

ఉద్దేశాన్ని జ్ఞానమిస్తుంది. రెండును కలిగినవారు వాటివలన మేలు అనుభవిస్తారు. జ్ఞానంలేని ఆస్తి దురదృష్టం. మనం దేవుని మార్గాలను ఆలోచించినప్పుడు, దేవుని ఏర్పాటులోని సంగతులను మనం మార్చలేమని త్వరలోనే మనం గుర్తిస్తాం. ఆయన వంకరగా చేసిన దానిని మనం చక్కపరచలేం. అందువలన బహు శ్రేష్ఠమైన దేమంటే, జీవితంలోని మన భాగాన్ని మనం అంగీకరించుదాం. మనం వృద్ధిచెందినప్పుడు సంతోషించాలి, మనం ఆయన మీద ఆధారపడాలని గ్రహించునట్టు ఆయన అభ్యుదయాన్నీ దుర్దశనూ కూడ తెస్తాడు. భవిష్యత్తు ఎలా ఉండబోతుందో మనం ఎరుగము గనుక, భవిష్యత్తును తన వశములో ఉంచుకొనే ఆయనయందు మనం నమ్మికయుంచవలసి యుంది.

## అమితములనుండి తొలిగిపో (7:15-22)

పనికిరాని అనేక విపరీతములను సొలొమోను గమనించాడు (7:15-17). మంచి మనుష్యులు యౌవనంలోనే చనిపోవడం, దుష్టులు దీర్ఘకాలం బ్రదికియుండడాన్ని అతడు చూచాడు. ఆ రెండు విపరీతాలు న్యాయంగా ఉన్నట్టు గోచరించలేదు: "అధికముగా నీతిమంతుడవై యుండకుము" అని కూడ అతడు సలహా యిచ్చాడు. మత సంబంధంగా అమితమైన పట్టుదల గలిగియుండ వద్దని - అజ్ఞానిగా, అనవసరమైన పట్టుదల చూపవద్దని అతని భావమైయుండవచ్చు. అధికముగా జ్ఞానివి కాకుమని కూడ అతడన్నాడు. అధికముగా దుర్మార్గపు పనులు చేయడం అవివేకం. అమితముగా ఏమి చేసినా, తమ జీవితాల్లో ముందుగానే తమ్మును తాము నాశనం చేసికొంటారు.

జీవితం మీద మంచి పట్టు మనకు ఉండాలి (7:18-20). దేవునియందు నమ్మిక యుంచి ఆయనయందు భయభక్తులు కలిగియుంటిమా, సమస్తము మేలుగా మల్చ బడతాయి. పట్టణమందుండు పదిమంది అధికారులకంటె ఈలాటి జ్ఞానము ఎక్కువ బలమునిస్తుంది. ప్రతి ఒక్కరు పొరపాట్లు చేస్తారు గనుక ప్రతి ఒక్కనికి జ్ఞానం అవసరమే.

చెప్పుడు మాటలు వినకుండ జాగ్రత్తపడుము (7:21, 22). అవి కేవలం మనలను గూర్చియే అయినా, అట్టివి మనలను బాధింపనీయకుండ చూచుకోవాలని ప్రతివాడు మరొకని గూర్చి మాట్లాడడం సహజం. మన పనివారు మనకు విరోధంగా చెడ్డ మాటలు పలికినా, వాటిని పట్టించుకోకూడదు. ఎందుకంటే, మంచి చేయాలనే ప్రయత్నంలో కూడా మనం పొరపాట్లు చేస్తాం. ఇతరుల గూర్చి మనం కూడా అనాలోచనగా తప్పులు మాట్లాడి ఉంటాం. మన నాలుకను జాగ్రత్తగా కాచుకొనడానికి యిది సహాయపడవచ్చు.

## జ్ఞానాన్ని వర్తింపజేయ నేర్చుకో (7:23-29; 8:1)

జీవితపు సరియైన కొనను పైకి తిప్పాలంటే, దేవుని యొద్దనుండి వచ్చే జ్ఞానం మనకు కావాలి. భక్తిని నేర్చుకొనడం కష్టం ఎందుకంటె, దేవుని గూర్చి తక్కువగా ఆలోచించే లోకంలో మనం ఉన్నాం. భక్తిని గూర్చిన వాస్తవాలను మనం నేర్చుకున్నప్పటికిని, మన సొంత జీవితంలో దాన్ని వర్తింపజేయడం కొన్నిసార్లు కష్టంగా ఉండవచ్చు.

సొలొమోను జ్ఞానియైయుండ నిశ్చయించుకున్నాడు, కాని తగినట్టుగా అతడు ఆ జ్ఞానాన్ని వర్తింపజేసికో లేదు (7:23-25). "సత్యమైనది దూరముగాను బహు లోతుగాను

ఉన్నది; దాని పరిశీలన చేయగలవాడెవడు?" అని అతడన్నాడు. మంచి, చెడ్డలనే వాటివెనుకనున్న సంగతుల హేతువులను అతడు ఎరుగగోరాడు. లోకంలో యింత బుద్ధిహీనత యింత వెర్రితనం ఎందుకు ఉందో కూడ అతడు తెలిసికోగోరాడు. దానినంతటిని తాను నేర్చుకున్నట్టు అతడు తలంచలేదు.

దుష్టురాలైన స్త్రీ లోకానికి మహా గొప్ప చెడుగు అన్న ఒక్క విషయాన్ని అతడు తెలిసికొన్నాడు (7:26). "అది వలలవంటిదై, ఉరులవంటి మనస్సును, బంధకములవంటి చేతులును కలిగిన స్త్రీ"; దేవుని దృష్టికి మంచివారైనవారు దానిని తప్పించుకొందురు వేశ్యావృత్తి యొక్క చెడుగులను గూర్చి సొలొమోను యిక్కడ మాట్లాడియుండవచ్చు.

ఒకరివెంట ఒకరు అన్నట్టు అనేకమంది వ్యక్తులను పరిశోధించిన తరువాత (7:27-29), సొలొమోను ఒక తీర్మానానికి చేరుకున్నాడు. వెయ్యిమంది పురుషులలో అతని అంచనా ప్రకారం ఒకడు మాత్రమే జ్ఞానిగా తేలాడు. స్త్రీలలో కూడ అతడు కనుగొనలేకపోయాడు. సొలొమోను యొక్క బలహీనతలలో స్త్రీలున్నారు. పరస్త్రీలైన అతని భార్యలు దైవ నియమంనుండి అతనిని తొలగించ సమ్మతించినందుకు అతని విషయమై దేవుడు విచారపడ్డాడు (1 రాజులు 11). సరియైన స్త్రీలతో అతడు కలసి యుండినట్టయితే, జ్ఞానియైన రాజు యొక్క తీర్మానాలు వ్యత్యాసంగా ఉండేయే.

ఈ తీర్మానంనుండి మరొక తీర్మానం వస్తుంది. దేవుడు నరులను యథార్థ వంతులనుగా చేశాడు, కాని వారాయననుండి దూరమగునట్లు వివిధ తంత్రములను కల్పించుకున్నారు. తమ్మును నిర్మించిన దేవుని మాటను ఆలకించడానికి మనుష్యులు నేర్చుకున్నట్టయితే తమ్మును, సంతృప్తిపరచుకొనడానికి ఆలాటి తంత్రాలు కల్పించు కోకుండపోయేవారు.

దేవునినుండి వచ్చు జ్ఞానము మానవ జీవితాన్ని వెలిగిస్తుంది (8:1). దేవునియందు నమ్మిక ఉంచియున్నట్టయితే, తన్ను సంతుష్టిపరచుకొనడానికి వాడు తంత్రాలు కల్పించుకోవలసిన అవసరత ఏర్పడేదికాదు. తన విశ్వాసము యొక్క తేజస్సుచేతను, దేవునియందలి అభయము లేక నమ్మికచేతను వాని ముఖము ప్రకాశిస్తూ ఉండేదే. యెహోవా యొక్క సౌందర్యం అతని ద్వారా యితరులకు ప్రకాశిస్తూ ఉంటుంది.

## ప్రభుత్వ అధికారానికి లోబడు (8:2-17)

రాజునుండి బయలుదేరు ఆజ్ఞను అలక్ష్యం చేయకూడదు, దేవునికి మాట యిచ్చిన తీరులో దాన్ని అంగీకరించు (8:2-8). తమకు అన్యాయం జరిగినా రాజ్య పౌరులు లోపముగా ఉండరాదని సొలొమోను హితవు పలికాడు. తనకు యిష్టమైన దానిని జరిగించడానికి రాజు శక్తివంతుడై యుంటాడు. తన రాజ్యంలో అతని మాట అధికారము గలదై ఉంటుంది. రాజు యొక్క అధికారాన్ని గౌరవించేవారికి తంటా ఉండదు. జ్ఞానియైయుండి, తన ప్రాధాన్యతలను క్రమముగా ఉంచుకునేవాడు రాజును ఘనపరచ డానికి సమయాన్ని, విధానాన్ని ఆలోచించుకుంటాడు.

పౌర అధికారాలకు లోబడడం క్రైస్తవ ప్రాధాన్యతలలో ఒకటి. పై అధికారులకు లోబడుడని రోములోని క్రైస్తవులకు పౌలు ఉపదేశించాడు (రోమా 13:1-7). పౌర

అధికారాలను గౌరవించని వారు, తమ ప్రాధాన్యతలను క్రమముగా ఉంచుకున్నవారు కారు. ప్రతిదానికి దాని సమయము, ఉద్దేశము ఉన్నందున ప్రభుత్వ అధికారానికి తన్ను లోబరచుకొనేలా జ్ఞానము ఒకని నడిపిస్తుందని సొలొమోను తీర్మానానికి వచ్చాడు. భరించడానికి కష్టమైనవైనా అధికారాలకు లోబడవలసియుంది. తనకు ఏమి జరుగుతుందో తెలియకపోయినా, జరిగేదాన్ని ఎవడును తప్పించుకోలేడు. సమయం వచ్చినప్పుడు తన ఆత్మ తన దేహాన్ని విడిచిపెట్టకుండ అతడు చేయలేడు. మనం ఈ పోరాటాన్ని చేయవలసిందే. దీనినుండి తప్పించబడేవాడెవడూ లేడు. జీవితం బహు స్వల్పమయ్యింది, మరణము మరి నిశ్చయమైనది, తిరుగుబాటుతో జీవించడానికి నిత్యత్వము బహు దీర్ఘమైనది.

మరోవైపు, సొలొమోను గమనించినవాటిలో బహు పనికిమాలినది నియంతయై ఏలుబడి చేసిన రాజు (8:9–13). నియంత చనిపోయినప్పుడు, గొప్ప అట్టహాసంగా సమాధి చేసియు, జనులు అతని త్వరగా మరచిపోయారు. అదే పని చేయడానికి మరొకడు అతని స్థానాన్ని తీసికొన్నాడు. ఆలాటి దుష్టత్వానికి తగిన శిక్ష వెంటనే కలుగునందున గత అనుభవంలోనుండి వారు ఏమియు నేర్చుకున్నట్టు లేరు. నియంతలు గత చరిత్రనుండి ఏ పాఠాలు నేర్చుకొనకపోయినా, రెండు విషయాలను గూర్చి మనం నిశ్చయంగా ఉండవచ్చు: (1) ఒక పాపి వందసార్లు తప్పులు చేయవచ్చు, కొంతకాలంవరకు అతడు బ్రదికియుండవచ్చు, కాని దేవునికి భయపడువాడే అంతములో క్షేమంగా ఉంటాడు (8:12), మరియు (2) దుష్టుడు దేవునికి భయపడనందున అతనికి క్షేమం కలుగదు (8:13).

దుర్మార్గులను మంచివారని, మంచివారిని దుర్మార్గులని ట్రీట్ చేయడం (భావించడం) తనకు మంచిగా కన్పించలేదని సొలొమోను ఒప్పుకున్నాడు (8:14). తాను బ్రతుకు దినములన్నిటను ఒకడు అనుభవించగల మేలేమంటే – తన చేతుల కష్టార్జితము అనుభవించడమే. దేవుడు దానిని వానికి ప్రసాదించిన బహుమానం. జ్ఞానాన్ని గ్రహించడానికి అతడు తన హృదయాన్ని అప్పగించుకున్నప్పుడు, దేవుడు లేకుండ దేనికీ ఏ అర్థమూ ఉండదు. రాత్రింబగళ్లు జీవితంయొక్క అర్థం కొరకు మనం వెదకినా, జీవాన్ని నీవెన్నడును కనుగొనలేవు. తనకు తెలుసునని భావించుతున్న జ్ఞాని సయితం దేవుని ఉద్దేశాలన్నిటిని నిజంగా గ్రహించలేదు (8:17).

## ముగింపు

తమ జీవితము యొక్క సరియైన భాగాన్ని పైకి తిప్పినవారు దేవుని ప్రాధాన్యతలను తమ జీవిత ప్రాధాన్యతలుగా కోరుకుంటారు. సరియైన ప్రాధాన్యతలు గలవారు మిగిలిన లోకానికి అవివేకులుగా కన్పించవచ్చు. భూసంబంధమైన దృష్టితో చూస్తే, కొన్ని ప్రాధాన్యతలకు అర్థమున్నట్టే కన్పించదు. కాని దేవునియందు నమ్మికయుంచినవారు భక్తిగలవారై ఏది శ్రేష్ఠమైనదో ఎరుగుదురు.